క్లుప్తంగా

నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

నల్లగొండ : తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ సర్కిల్, నల్లగొండ ఆధ్వర్యంలో ఆదివారం బస్టాండ్ సమీపంలోని సర్కిల్ విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు విద్యుత్ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ సిబ్బంది, అధికారులు, వినియోగదారులు పాల్గొనాలని కోరారు.

మర్రిగూడ : నాంపల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో నేడు తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మర్రిగూడ విద్యుత్ ఏఈ రాజేష్ శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులు పాల్గొని విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే సమావేశ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

చండూరు : మండల కేంద్రంలో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ చండూరు యూనిట్ కార్యవర్గ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో టీఎన్‌జీఓ మండల యూనిట్ నూతన కమిటీని సంఘం జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి, కార్యదర్శి జె.శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల యూనిట్ నూతన అధ్యక్షుడిగా జి.లింగయ్య, కార్యదర్శిగా కె.నిఖిల్‌కుమార్, కోశాధికారిగా కె.శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా ఎం.గోపాల్‌రెడ్డి, పి.ప్రభువర్ధన్‌రెడ్డి, జి.శ్రీనుకుమార్, ఎం.పద్మ, సంయుక్త కార్యదర్శులుగా సాయిభరద్వాజ్, సరిత, ధర్మేందర్, శోభారాణి, ఈసీ మెంబర్లుగా నాగార్జున, శ్రీలేఖ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు వంగూరు విజయకృష్ణ, టీఎన్‌జీఓ జిల్లా కోశాధికారి ఎం.జయరావు, అసోసియేట్ అధ్యక్షుడు డీవి రాజు, ఉపాధ్యక్షులు కె.దశరథ, అలీమ్, సత్యనారాయణ, కొండమల్లేపల్లి యూనిట్ అధ్యక్షుడు మనోజ్‌ప్రదీప్, నల్లగొండ తాలూకా యూనిట్ అధ్యక్షుడు లక్ష్మయ్య, కోశాధికారి దుర్గయ్య, పి.వెంకట్‌రెడ్డి, సతీష్, ఏఈఓల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.నరసింహ, పంచాయతీ సెక్రటరీ జిల్లా బాధ్యులు కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్యశిబిరం

నకిరేకల్ : పట్టణంలోని మూసీరోడ్‌లో గల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో సోమవారం హైదరాబాద్‌లోని మ్యాక్స్ విజన్ శ్రీమహలక్ష్మి సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు వంటల రామలింగయ్య, కార్యదర్శి కందుల సోమయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్స నిర్వహించనున్నట్లు తెలిపారు.

సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

మర్రిగూడ : గ్రామాలలో 2019–24వరకు సర్పంచ్‌లు చేపట్టిన వివిధ రకాల పనుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చెరుకు లింగంగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి 11నెలలు గడిచినా పెండింగ్ బిల్లులు చెల్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించి తమను ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట యాదగిరి, గణేష్ ఉన్నారు.

చంద్రయ్య మృతికి ఎమ్మెల్యే వీరేశం సంతాపం



వేముల చంద్రయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

శాలిగౌరారం : మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన వేముల పెదచంద్రయ్య (70) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వేముల వీరేశం గ్రామంలో చంద్రయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఓదార్చి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు చామల శ్రీనువాసులు, అన్నెబోయిన సుధాకర్, మాద యాదగిరి, కుర్ర లింగయ్య, వేముల ఈదయ్య, గోపినాథ్, అంబీప్, సాయికుమార్, కట్లకుంట్ల రమేశ్, మోదాల రమేశ్ తదితరులు ఉన్నారు.

షరీఫ్‌కు ఘన నివాళి

కేతేపల్లి : మండలంలోని భీమారం గ్రామానికి చెందిన ఉగ్గూ షరీఫ్(53) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈ మేరకు మాజీ ఎంపీపీ బడుగుల శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్ బడుగుల కవితనరేందర్‌యాదవ్‌లు షరీఫ్ మృతదేహాన్ని వేర్వేరుగా సందర్శించి నివాళులర్పించారు.

శంకుస్థాపనలకే పరిమితమా!



ఇండ్లూరు వద్ద గుంతలమయంగా ఉన్న రోడ్డు



వెంకటాద్రిపాలెం వద్ద గుంతలమయంగా ఉన్న రోడ్డు

- గుంతలమయంగా ఇండ్లూర్–చందనపల్లి రోడ్డు
- రెండుమార్లు శంకుస్థాపనలు చేసిన ప్రజాప్రతినిధులు
- నేటికీ మొదలు కాని పనులు
- ఇబ్బంది పడుతున్న ఆయా గ్రామాల వాహనదారులు, రైతులు

తిప్పర్తి : మండలంలోని ఇండ్లూరు నుంచి చందనపల్లి వరకు బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ రోడ్డు ద్వారా ఎల్లమ్మగూడం, గోదోరిగూడం, మామిడాల, ఇండ్లూరు, వెంకటాద్రిపాలెం, పజ్జూరు, యర్రగడ్డలగూడెం, సోమోరిగూడెం, లక్ష్మీపురం గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్తుంటారు. కానీ రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. వర్షం వస్తే గుంతల్లో నీరు నిల్వ ఉండి ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో అప్పటి నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఇండ్లూర్ నుంచి చందనపల్లి వరకు బీటీ రెన్యూవల్‌కు రూ.4 కోట్ల 36 లక్షల వ్యయంతో 2023 జూలైలో శంకుస్థాపన చేశారు. కానీ పనులు మాత్రం జరగలేదు.

11.2 కిలోమీటర్ల రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన

ఇండ్లూరు నుంచి చందనపల్లి వరకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో మంజూరైన బీటీ రెన్యూవల్ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. అనంతరం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మార్చి 2024లో ఇండ్లూర్ గ్రామం వద్ద 11.2 కిలోమీటర్ల డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.26.50 కోట్ల నిధులతో శంకుస్థాపన చేశారు. అయినా నేటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. రెండుమార్లు రోడ్డు పనులకు శంకుస్థాపన జరిగినప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రయాణికులు, రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు చొరవ తీసుకుని రోడ్డు పనులను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాక్టర్లు తిరగాలంటే ఇబ్బందిగా ఉంది



రోడ్డు గుంతలమయంగా మారడంతో ట్రాక్టర్లతో వ్యవసాయ పనులకు వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉంది. ధాన్యం లోడ్లు, గడ్డి ట్రాక్టర్లు తీసుకురావడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలి.

– జక్కలి మంగయ్య, రైతు, ఇండ్లూరు

ఆటో ప్రయాణం కష్టంగా మారింది



ఇండ్లూరు నుంచి చందనపల్లికి వెళ్లాలంటే గుంతలు ఎక్కువగా ఉండడంతో ఆటోలో వెళ్లాలంటే ఆలస్యం అవుతోంది. రెండు నెలల క్రితం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గుంతలు పూడ్చుకున్నాం. మంజూరైన రోడ్డు పనులను అధికారులు వెంటనే చేపట్టాలి.

– కొల్లు శ్రీను, వెంకటాద్రిపాలెం

త్వరలో పనులు ప్రారంభం అవుతాయి

ఇండ్లూరు నుంచి చందనపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయి. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలు, మిషన్ భగీరథ పైపులైన్ తొలగించిన వెంటనే పనులు ప్రారంభం అవుతాయి.

– ఎండీ గౌస్, ఆర్‌అండ్‌బీ, ఏఈ

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ధర్నా



పీఏసీఎస్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

చిట్యాల : వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కొట్టుకుపోయిన ధాన్యానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం మండలంలోని వెలిమినేడు పీఏసీఎస్ కార్యాలయం ఎదుట సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లం మహేష్, మండల రూరల్ కార్యదర్శి అర్రూరీ శ్రీనువాస్ పాల్గొని మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం ఇటీవల కురిసిన వర్షాలతో పూర్తిగా తడవడంతో పాటు మరికొందరి రైతుల ధాన్యం వర్షపునీటితో కొట్టుకుపోయిందని వాపోయారు. అయినా అధికారులు, పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే రైతుకు పరిహారం ఇవ్వాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధరను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిన్నకాపర్తి గ్రామ పార్టీ కార్యదర్శి కోనేటి రాములు, రైతు సంఘం మండల ఉపాధ్యక్షుడు రూపని ఇద్దయ్య, వెలిమినేడు గ్రామ పార్టీ శాఖ కార్యదర్శి పంది నరేష్, నాతి వెంకట్రామయ్య, సురుకంటి మోహన్‌రెడ్డి, దేశబోయిన నర్సింహ, అర్రూరీ శంభయ్య, ఆడేపు రమేష్, పాపిరెడ్డి, బొడ్డు నర్సింహ, రుద్రారపు భిక్షం, వీరమల్ల చంద్రయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరెగూడెంలో..

మండలంలోని ఆరెగూడెంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో వర్షాలకు తడిసిన ధాన్యాన్ని రైతు సంఘం మండల అధ్యక్షుడు లడే రాములు పరిశీలించారు. ఆయన వెంట సీపీఎం గ్రామ కార్యదర్శి మోటె తిరుమలయ్య, లడే శ్రీను, రైతు సంఘం నాయకులు మురాల అంజయ్య, దొడ్డి మహేష్, సురేష్, మీనయ్య, శంకరయ్య, శేఖర్, మల్లయ్య, నర్సింహ ఉన్నారు.

బ్యాంకు ఏర్పాటు చేయడం అభినందనీయం



నకిరేకల్‌లో కెనరా బ్యాంకు నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

- ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : పట్టణంలో నూతనంగా కెనరా బ్యాంకు ఏర్పాటు చేయడం అభినందనీయమని, బ్యాంకు పురోభివృద్ధికి ఖాతాదారులు పాటుపడాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం పట్టణంలోని వాసవీనగర్‌లో ఏర్పాటు చేసిన కెనరా బ్యాంకు నూతన బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కెనరా బ్యాంకు సేవలను విస్తృతం చేయడం హర్షనీయమన్నారు. అనంతరం బ్యాంకు రీజినల్ మేనేజర్ శాంతికుమార్ మాట్లాడుతూ.. బ్యాంకు దేశవ్యాప్తంగా 9658 శాఖలతో రూ.23లక్షల 58వేల కోట్ల వ్యాపారంతో దేశంలోనే 4వ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్, బ్రాంచ్ మేనేజర్ పార్థ బట్టాచార్య, ఫీల్డ్ ఆఫీసర్ భుక్త నాగేశ్వరరావు, మేనేజర్ అవినాష్‌కుమార్, విక్రమ్, వార్డు కౌన్సిలర్ పన్నాల పావని శ్రీనివాస్‌రెడ్డి, పన్నాల రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొడ్డు రకం వరి ధాన్యానికి బోనస్ చెల్లించాలి



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : సన్నరకంతో పాటు దొడ్డు రకం వరిధాన్యానికి క్వింటాల్‌కు రూ.500లు బోనస్ చెల్లించాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండ పట్టణ పరిధిలోని ఆర్జాలబావిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి స్టేట్ వేర్ హౌజింగ్ కార్పొరేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పదిరోజులుగా లారీల్లో నుంచి ధాన్యం దిగుమతి చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వర్షాలకు ధాన్యం తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి ధాన్యం త్వరగా కాంటా వేయడంతో పాటు ఎగుమతి, దిగుమతి వెంటనే జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పిల్లి రామరాజుయాదవ్, పోతెపాక సాంబయ్య, మిర్యాల వెంకటేశం, పోతెపాక లింగస్వామి, బీపంగి జగ్జీవన్, కంకణాల నాగిరెడ్డి, దాసరి సాయి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, కాశమ్మ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప సన్నిధానం ప్రారంభం



అన్నదానం నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

కేతేపల్లి : మండల కేంద్రంలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన సన్నిధానాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప మాలధారులు హోమాలు నిర్వహించారు. సాయంత్రం గురుస్వాముల ఆధ్వర్యంలో అష్టాదశ కలశ పూజ, గణపతి, శివపూజ, లక్ష్మిపూజ, శయనహారతి తీర్థప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మణికంఠస్వామికి పంచామృతాలు, కుంకుమ, చందనం, భస్మం, కనక పుష్పాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు, అయ్యప్పస్వాములు అధికసంఖ్యలో హాజరై స్వామివారి పడిపూజను తిలకించారు. ఈ సందర్భంగా 1000మందికి అన్నదానం చేశారు. వేడుకలో అయ్యప్ప మాలధారులు ఎ.యాదగిరి, అక్కెనపల్లి రవి, ఎ.మల్లయ్య, బి.రవి, శివ, అయితగోని విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



ఆర్జాలబావి కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఎగుమతులను పరిశీలిస్తున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి

నల్లగొండ రూరల్ : ధాన్యం కొనుగోలు వేగవంతంగా చేపట్టాలని నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని ఆర్జాలబావి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, ధాన్యం నిల్వ చేసే గోదామును ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా తేమ శాతం పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఏదైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ధాన్యం దిగుమతిలో గోదాముల వద్ద తీవ్ర జాప్యం జరుగుతుండడంతో పరిశీలించారు. ధాన్యం దిగుమతి అయితేనే లారీలు తిరిగి ఐకేపీ కేంద్రాలకు వెళ్తాయని అవసరమైతే ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని గోదాము మేనేజర్ పాషాకు సూచించారు.

విద్యాశాఖలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నల్లగొండ టౌన్ : విద్యాశాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేనట్టుగా నల్లగొండ విద్యాశాఖలో ఉపాధ్యాయుల అక్రమ డిప్యుటేషన్లకు అడ్డూ అదుపు లేకుండా పోతుందన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల అక్రమ డిప్యుటేషన్ల దందా బంద్ కావాలంటే డీఈఓను బదిలీ చేయాలని కోరారు. వెంటనే మంత్రి, కలెక్టర్‌లు స్పందించి అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయాలని, లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. సమావేశంలో నాయకులు కిరణ్, నవదీప్, సాయి, జలేందర్, మున్నా, జోసెఫ్, వంశీ, సిరివెన్నెల, చరణ్, పవన్ తదితరులు ఉన్నారు.

ఘనంగా క్రైస్తవుల సమాధుల పండుగ



కేతేపల్లిలో సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



కట్టంగూర్ : చిన్నపురిలో సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కేతేపల్లి : మండల కేంద్రంలో క్రైస్తవులు శనివారం ఆత్మల పండుగ (సమాధుల పండగ)ను ఘనంగా జరుపుకున్నారు. మృతి చెందిన తమ పూర్వీకులు, కుటుంబ సభ్యుల ఆత్మలకు శాంతి కలగాలని కోరుకుంటూ ప్రతి ఏటా నవంబర్ మాసంలో క్రైస్తవులు ఈ పండగ జరుపుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా స్థానిక జాపమాల మాత చర్చిలో మతగురువు ఫ్రాంచీస్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సాయంత్రం వేళ క్రైస్తవులు మృతి చెందిన తమ కుటుంబీకుల సమాధుల వద్దకు వెళ్లి వాటిని పూలతో అలంకరించి సమాధులపై కొవ్వొత్తులు వెలిగించి తమ పూర్వికుల ఆత్మలకు శాంతి ప్రసాదించాలని ఏసు ప్రభువును వేడుకున్నారు. మత గురువులు ఫ్రాన్సిస్, షాజి, అరుణ్, సునీల్ ఆధ్వర్యంలో సమాధుల వద్ద ఏర్పాటు చేసిన పూజాప్రాంగణంలో ప్రార్థనలు చేశారు. వేడుకలో జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు పసల శౌరయ్య, చర్చి కమిటీ ప్రతినిధులు, పసల ఆరోగ్యయ్య, మాదాసు బాలస్వామి, ఆర్లగడ్డ అమర్, జోసఫ్, విజయ్‌రాజు, కె.విజయ్‌కుమార్, పసల ధనరాజ్, పాలిశెట్టి జోజప్ప, కాల్వ శౌరయ్య, చింతా ఆంధ్రయ్య, ఎ.ప్రవీణ్, అవ్వారి రాయప్ప, బందా లూబెత్ పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండలంలోని ముత్యాలమ్మగూడెం గ్రామపంచాయతీ పరిధి చిన్నపురి గ్రామంలో శనివారం క్రైస్తవులు సమాధుల (ఆత్మల) పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని నిష్కలంకమాత ప్రార్థన మందిరం సమీపంలో ఉన్న సమాధులను అందమైన పూలమాలలు, విద్యుత్ దీపాలు, కొవ్వొత్తులతో వెలిగించి చనిపోయిన వారి ఆత్మలకు శాంతి కలగాలని చర్చి పాదర్ పసల గ్రెగోరి, క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కొంక ప్రవీణ్, శాంసన్, కనుమూరి భాస్కర్, ప్రేమలత, రంజిత్, అలెగ్జాండర్, మరయ్య, ప్రణయ్, విలియం, విజయ్‌బాబు, ఆంథోని, ప్రసాద్, గ్రామస్తులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు మెరుగైన వైద్యం



బాధితురాలికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు : కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కల్వకుంట్ల గ్రామానికి చెందిన మట్టిపల్లి లలితకు మంజూరైన రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శనివారం మండల కేంద్రంలో అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అను నిత్యం నియోజకవర్గ అభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, జిల్లా నాయకుడు వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, కుంభం యాదగిరిరెడ్డి, బొందు రవి, ఇరుగుదిండ్ల భిక్షం, రావుల గోపాల్, యాదయ్య, యాదగిరి, శంకర్, స్వామి, వెంకన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య బలోపేతానికి ఉపాధ్యాయులు కృషిచేయాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అంజన్‌రావు

నాంపల్లి : ప్రభుత్వ విద్య బలోపేతానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు పానుగోటి అంజన్‌రావు అన్నారు. శనివారం మండలంలోని చిట్టంపహాడ్, వడ్డెపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, హాజరు పట్టికను పరిశీంచారు. పాఠశాలల్లో ఉన్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బాలల సంక్షేమ సమితి సభ్యుడు ఈద భాస్కర్, తదితరులు ఉన్నారు.

సీపీఎం జిల్లా మహాసభల కరపత్రాల విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

చండూరు : మిర్యాలగూడ పట్టణంలో డిసెంబర్ 2,3,4తేదీలో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం కోరారు. శనివారం పట్టణంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసే శ్రీశైలం సొరంగం మార్గం, ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం తగిన నిధులు కేటాయించకపోవడంతో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు, గట్టుప్పల మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ, మోగదాల వెంకటేశం, చిట్టిమల్ల లింగయ్య, దుబ్బాక సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్లకు శిక్షణ

చిట్యాల : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామాల్లో నూతనంగా నియమించిన మల్టీపర్పస్ వర్కర్లకు బోరు మోటార్ మరమ్మతులపై శనివారం మిషన్ భగీరథ విభాగం ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే శిక్షణలో మిషన్ భగీరథ ఈఈ శాంతకుమారీ పాల్గొని మాట్లాడారు. మొదటి రోజు వారికి ప్లంబింగ్ విభాగంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ నర్సింహ, ఎంపీడీఓ జయలక్ష్మి, ఏఈ సత్యం తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో మహిళల ఆర్థికాభివృద్ధి



మహిళలకు కోడి పిల్లలు పంపిణీ చేస్తున్న డీపీఎం బెనర్జీ

త్రిపురారం : మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని డిస్టిక్ ప్రాజెక్ట్ మేనేజర్ (డీపీఎం) బెనర్జీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా త్రిపురారంలో స్త్రీ నిధి కార్యాలయం వద్ద పలు గ్రామాలకు చెందిన మహిళలకు పెరటి కోళ్ల పెంపకంలో కోడి పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీపీఎం బెనర్జీ మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్రిపురారం ఏపీఎం అశోక్ కుమార్ మాట్లాడుతూ.. మండలంలోని 16 గ్రామ సంఘబంధాలకు 16యూనిట్లు గ్రేడింగ్ చేసి రూ.5500 ఒక్క యూనిట్‌లో భాగంగా ఒక్క యూనిట్‌కు 50కోడి పిల్లలతో 800కోడి పిల్లలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ కుమారి, తహసీల్దార్ గాజుల ప్రమీల, ఎంఈఓ రవి నాయక్, త్రిపురారం కార్యదర్శి కొడిరెక్క రాజేంద్ర కుమార్, సీసీ దేవ్ సింగ్, హేమ, రాందాస్, ఎంఎంఎస్ అధ్యక్షురాలు మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న పెద్ది బాలనర్సింహ

కట్టంగూర్ : మండల కేంద్రానికి చెందిన కొంపెల్లి వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులను పెద్ది ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెద్ది బాలనర్సింహాగౌడ్ పరామర్శి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చెవుగోని జనార్దన్ రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పోగుల నర్సింహ, కళ్లెం నాగేష్, యర్కల మల్లేష్, అంతటి సతీష్, పెద్ది మహేష్, సైదిరెడ్డి తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నకిరేకల్ : మున్సిపాలిటీలోని ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని 7వవార్డు బాబాసాహెబ్‌గూడెంలో ఆమె పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ముందున్న సాగర్ వాటర్ ట్యాంక్‌లోని నీరు రావడం లేదని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డులో ఉన్న సమస్యలను త్వరలో పరిష్కరించనున్నట్లు తెలిపారు.



వార్డులో పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రజిత

కంపచెట్ల తొలగింపు



కంపచెట్ల తొలగింపును పరిశీలిస్తున్న అల్వాల్‌రెడ్డి

మర్రిగూడ : మండల కేంద్రం నుంచి కొండూరుకు వెళ్లే రోడ్డులో డోర్నాల బావి వద్ద ఉన్న కంపచెట్లను శనివారం మండల సామాజిక కార్యకర్త కొడాల అల్వాల్‌రెడ్డి జేసీబీ సహాయంతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా అల్వాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రదేశంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, మున్ముందు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రహదారి వెంట ఉన్న చెట్లను తొలగింపజేసినట్లు తెలిపారు. ఆయన వెంట రవి, యాదగిరి, శంకర్ తదితరులు ఉన్నారు.

బీసీ గర్జనను విజయవంతం చేయాలి

శాలిగౌరారం : మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపులో ఆదివారం నిర్వహించే బీసీ గర్జనను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు ఆలేటి శ్రీనివాస్ కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు శతాబ్దాల కాలంగా అన్ని రంగాలలో అన్యాయమే జరుగుతుందన్నారు. బీసీలకు చట్టసభలలో ప్రాధాన్యం కొరవడిందని, బీసీల హక్కుల సాధన కోసం చలో మిర్యాలగూడ బీసీ గర్జనకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు ఉన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణపై పిటీషన్

మిర్యాలగూడ : దామరచర్ల మండలం గణేష్‌పాడు వద్ద కొనసాగుతున్న పెన్నా(అంబుజా) సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు రెండోసారి చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణను నిలిపివేయాలని కోరుతూ ఇటీవల రిట్ పిటీషన్ దాఖలైంది. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం శూన్యంపాడు గ్రామానికి చెందిన నక్క శ్రీనివాస్ నవంబర్ 12న జరపనున్న ప్రజాభిప్రాయ సేకరణను నిలిపివేయాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. కర్మాగారం ఏర్పాటు సమయంలో యాజమాన్యం ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని పిటీషనర్ పేర్కొన్నారు. కాలుష్యాన్ని అరికట్టడంలో విఫలమైందని, స్థానికులకు విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించారని పిటీషన్‌లో పేర్కొన్నారు.